సాక్షి వరంగల్

శనివారం । 22 । మార్చి । 2025



ఉత్సాహంగా రూబిజెస్ట్ - 2025

కాకతీయ యూనివర్సిటీ మహిళా ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో రూబిజెస్ట్-2025లో భాగంగా థిమ్ డే వేడుకలు ఉత్సాహంగా కొనసాగాయి. - 8లో▸



ఒకే దేశం, ఒకే ఎన్నిక నష్టమే...

సమాజానికి 'ఒకే దేశం- ఒకే ఎన్నిక' నష్ట దాయకమని ప్రముఖ సామాజిక వేత్త, రిటైర్డ్ ప్రొఫెసర్ హరగోపాల్ అభిప్రాయపడ్డారు. - 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం $35^0/23^0$

జిల్లాలో ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం తర్వాత చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది. సాయంత్రం సమయంలో ఆహ్లాదంగా ఉంటుంది.

e టిమ్స్‌తో జీగా..

ఆర్టీసీలో డిజిటల్ చెల్లింపులతో టికెట్ల జారీ

- ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంటున్న సంస్థ
- వరంగల్ రీజియన్‌కు చేరుకున్న 750 ఇ-టిమ్స్
- టికెట్ జారీపై మరింత స్పష్టత
- ప్రతి స్టేజీ వారీగా వివరాలు తెలుసుకునే సౌకర్యం

హన్మకొండ: ప్రయాణికులకు మెరుగైన, నాణ్యమైన సేవలందించేందుకు ఆర్టీసీ ఆధునిక సాంకేతికను అందిపుచ్చుకుంటోంది. ప్రయాణికులకు సౌకర్యవంతంగా టికెట్ జారీకి ఇ-టిమ్స్‌ను ప్రవేశ పెట్టింది. దీనిలో భాగంగా ఆర్టీసీ వరంగల్ రీజియన్‌లోని ఆర్టీసీ బస్సుల్లో నగదు రహిత సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఈమేరకు కండక్టర్లు, డ్రైవర్లకు శిక్షణ ఇస్తూ క్రమంగా ఇ-టిమ్స్‌ను ప్రవేశపెడుతున్నారు. ఇప్పటివరకు ఉపయోగించిన టిమ్స్‌తో చూసుకుంటే మరిన్ని ఫీచర్లతో వీటిని రూపొందించారు.

టిమ్‌పై క్యూఆర్ కోడ్

ప్రయాణికులు తమ వెంట నగదు లేకున్నా డిజిటల్ పేమెంట్స్ ద్వారా టికెట్ పొందే సౌకర్యం కలగనుంది. చిల్లర సమస్యకు తెర పడనుంది. టిమ్‌పై క్యూఆర్ కోడ్ ఉంటుంది. దాన్ని స్కాన్ చేయడం ద్వారా చెల్లింపులు చేసి టికెట్ పొందవచ్చు.

మరికొన్ని అవసరమే..

వరంగల్ రీజియన్‌లో ప్రతిరోజూ 936 బస్సులు వివిధ రూట్లలో తిరుగుతుంటాయి. 3.76 లక్షల కిలోమీటర్లు తిరిగి సగటున రోజుకు రూ.2.20 కోట్ల ఆదాయాన్ని సంస్థ రాబట్టుకుంటుంది. 936 బస్సులకుగాను ప్రస్తుతం 750 ఇ-టిమ్స్ మాత్రమే చేరుకున్నాయి. అన్ని బస్సుల్లో అమలుచేయాలంటే మరో 186 అవసరం. ఎప్పుడైనా టిమ్ మొరాయిస్తే బాగు చేసే వరకు వినియోగించుకునేలా అదనంగా మరికొన్ని అవసరం.



ప్రతీది ఆన్‌లైనే..

స్టేజీల వారీగా ఎన్ని టికెట్లు జారీ అవుతున్నాయి.. ఇందులో డిజిటల్ పేమెంట్స్ ద్వారా ఎన్ని, నగదు రూపేణా ఎన్ని, జీరో టికెట్లు ఎన్ని జారీ అయ్యాయో తెలుసుకునే సౌకర్యం ఉంది.

- ఆర్టీసీ డిపోలు, వరంగల్ రీజియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన డ్యాష్ బోర్డు ద్వారా ప్రతీబస్‌లో జారీ అవుతున్న టికెట్ల వివరాలు స్టేజీల వారీగా అధికారులు ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చు.
- ఈ టిమ్స్ పూర్తిస్థాయిలో పని చేయడానికి మరికొంత సమయం పట్టనుంది.
- ముందుగా ఆన్‌లైన్ ప్యాసింజర్ రిజర్వేషన్ సిస్టం (ఓపీఆర్ఎస్) వర్తింపజేస్తున్న బస్సులో వీటిని వినియోగించనున్నారు.
- కండక్టర్లు, డ్రైవర్లకు శిక్షణ ఇచ్చిన తర్వాత పల్లె వెలుగు బస్సుల వరకు క్రమంగా అమలు చేయడానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

ఆధునిక సాంకేతిక పద్ధతులతో ఇ-టిమ్స్



ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఇ-టిమ్స్‌ను రూపొందించారు. ప్రస్తుతం రిజర్వేషన్ సౌకర్యం కల్పిస్తున్న బస్సుల్లో మాత్రమే వీటిని వినియోగిస్తున్నాం. క్రమంగా పల్లె వెలుగు వరకు అమలు చేస్తాం. వీటి ద్వారా ప్రయాణికులకు సులువుగా టికెట్ జారీ చేయవచ్చు.

- డి.విజయ భాను, ఆర్టీసీ వరంగల్ ఆర్ఎం




ఇ-టిమ్ డిజిటల్ పేమెంట్ ద్వారా టికెట్ జారీ



బెట్టింగ్.. చీటింగ్!

వర్ధన్నపేట మండలంలోని ఓ గ్రామానికి చెందిన రాజ్‌కుమార్ హనుమకొండలో స్నేహితులతో కలిసి ఉంటూ ఉద్యోగం కోసం కోచింగ్ తీసుకునేవాడు. ఈ క్రమంలోనే ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటుపడి సుమారు రూ.30 లక్షల వరకు పోగొట్టుకున్నాడు. ఇందుకోసం అప్పులు చేశాడు. చివరకు తండ్రికి విషయం చెప్పి ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించాడు. దీంతో ఆయన ఉన్న ప్లాటును అమ్మి అప్పులు తీర్చాడు. అయితే ఎలాగైనా పోయిన డబ్బులు సంపాదించాలని రాజ్‌కుమార్ మళ్లీ అప్పులు చేసి యాప్‌లో బెట్టింగ్ కాశాడు. ఈ క్రమంలోనే అప్పుల వాళ్ల వేధింపులు పెరగడంతో ఈ ఏడాది జనవరి ఐదున తండ్రిని రూ.నాలుగు లక్షలు అడిగాడు. తండ్రి లేవని చెప్పడంతో రాజ్‌కుమార్ ఉరేసుకుని జనవరి 10న ఆత్మహత్య చేసుకున్నాడు.

రాయపర్తికి చెందిన కొండపల్లి ధర్మరాజు డిగ్రీ చదివి బిర్యానీ సెంటర్ నిర్వహించి నష్టపోయాడు. హనుమకొండకు మకాం మార్చి పోస్టల్‌కాలనీలో తాను విద్యార్థినని చెప్పి అద్దె గదిలో నివాసం ఉన్నాడు. ఈ క్రమంలోనే ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటుపడి అప్పులై దొంగ అవతారం ఎత్తాడు. హనుమకొండ, హసన్‌పర్తి, కేయూసీ, సుబేదారి, సంగెం, స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి, దేవరుప్పుల పోలీస్ స్టేషన్ల పరిధిలో మొత్తం 17 చోరీల్లో 334 గ్రాముల బంగారు ఆభరణాలు, కిలో 640 గ్రాముల వెండి చోరీ చేశాడు. చివరకు గత అక్టోబర్ 28న పోలీసులకు చిక్కాడు.



ఐపీఎల్ వేళ యాప్‌లతో పందేల జోరు

- అత్యాశకు వెళ్తే ఆర్థికంగా నష్టపోవుడే..
- పిల్లలపై ఓ కన్నేసి ఉంచాల్సిందే..
- తల్లిదండ్రుల అప్రమత్తత అవసరమే
- గత ఘటనలను గుర్తు చేస్తున్న పోలీసులు

సాక్షి, వరంగల్:

ఐపీఎల్ రానే వచ్చింది. శనివారం నుంచి ఈ టోర్నీ ప్రారంభం కానుంది. దీంతో ఈ జోష్‌ను క్యాష్ చేసుకునేందుకు బెట్టింగ్ రాయుళ్లు సిద్ధమవుతున్నారు. గతంతో నగరాలకే పరిమితమైన ఈ బెట్టింగ్ ప్రస్తుతం పల్లెలకు సైతం విస్తరిస్తోంది. ఎవరితో సంబంధం లేకుండానే ఫోన్‌లోనే క్రికెట్ బెట్టింగ్ యాప్‌లు నిక్షిప్తం చేసుకొని ఫోన్‌పే, గూగుల్ పే, యూపీఐ ఐడీలతో డబ్బులు బదిలీ చేస్తూ బెట్టింగ్ చేస్తున్నారు. కొందరేమో తమ తల్లిదండ్రుల బ్యాంకు ఖాతాలు అనుసంధానం చేసి ఉన్న యూపీఐ ఐడీల ద్వారా, మరికొందరు కాలేజీలో పరీక్షలు, హాస్టల్ ఫీజు అని తల్లిదండ్రుల నుంచి డబ్బులు వసూలు చేసి ఈ బెట్టింగ్ చేస్తున్నారు. ఇప్పుడు ఐపీఎల్ మొదలవుతుండడంతో ఈ బెట్టింగ్ యాప్‌ల జోరు పెరగొచ్చని వరంగల్ కమిషనరేట్ పోలీసులు అనుమానిస్తున్నారు. అందుకే పిల్లలు వాడే సెల్‌ఫోన్లు, వారి ప్రవర్తనపై కన్నేసి ఉంచాలని సూచిస్తున్నారు. యాప్‌ల్లో డబ్బులు పోయి ఏకంగా ప్రాణాలు తీసుకున్న యువకులు ఉన్నారు. ఆ దిశగా ఎవరూ వెళ్లొద్దని పోలీసులు అంటున్నారు. బెట్టింగ్ పెట్టే వాళ్లపై కేసులు నమోదుచేసే అవకాశం ఉండడంతోనే దందా నిర్విరామంగా సాగుతోందని, బెట్టింగ్ చేసిన వారు పోలీసులకు ఫిర్యాదు చేసే అవకాశం ఉండకపోవడం కూడా ఓ కారణమని చెప్పవచ్చు.

75 బెట్టింగ్ వెబ్‌సైట్లు, యాప్‌లు



స్పోర్ట్స్ బెట్టింగ్ కార్యకలాపాల విలువ భారత్‌లో ప్రతి ఏటా రూ.8,20,000 కోట్ల దాకా ఉంటుందని థింక్ చేంజ్ ఫోరమ్ (టీసీఎఫ్) నివేదిక చెబుతోంది. భారత్‌లో 14 కోట్ల మంది బెట్టింగ్, గ్యాంబ్లింగ్ కార్యకలాపాల్లో పాలుపంచుకుంటున్నారు. ఐపీఎల్ సీజన్‌లో ఈ సంఖ్య 37 కోట్ల దాకా పెరుగుతోందని టీసీఎఫ్ నివేదిక పేర్కొనడం చూస్తే బెట్టింగ్ యాప్ జోరు ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. దాదాపు 75 వెబ్‌సైట్లు, యాప్‌లు బెట్టింగ్‌కు సంబంధించినవి పనిచేస్తున్నాయి.

రేషియో యాప్‌ల జోరు..

క్రికెట్ బెట్టింగ్ నిర్వాహకులు ఒప్పుడు ఫోన్ల ద్వారా ఆయా జట్టు విజయాలపై బుకీలకు సమాచారం ఇచ్చేవారు. ఫంటర్లను పెట్టుకొని దందా నడిపేవారు. ఇప్పటికీ ఈ దందా ఉన్నా.. ఇప్పుడు రూపు మార్చుకుంటోంది. ముఖ్య నిర్వాహకుడే యాప్ రూపొందించి బుకీలకు యూజర్ నేమ్, పాస్‌వర్డ్‌లు ఇచ్చి నయా దందాకు శ్రీకారం చుడతాడు. ప్రధాన నిర్వాహకులు ఆయా జట్ల విజయాలకు సంబంధించిన రేషియోను ఆ యాప్‌లో నిక్షిప్తం చేస్తుండడంతో ఇందుకు అనుగుణంగా బుకీలు తమ ఫంటర్లకు చెప్పి దందా చేస్తారు. ఇలా బుకీలకు వచ్చిన ఆదాయంలోనే కొంత డబ్బును ప్రధాన నిర్వాహకుడికి అందిస్తారు. యూపీఐ చెల్లింపులతో పోలీసులకు దొరికే అవకాశం ఉండడంతో బిట్‌కాయిన్ల రూంలో దందా చేస్తుండడం గమనార్హం. గతంలో పోలీసులకు చిక్కిన బెట్టింగ్ బుకీలతో ఈ దందా వెలుగులోకి వచ్చింది.

యాప్‌ల సమాచారం ఇవ్వాలి..



గూగుల్ ప్లే స్టోర్ నుంచి డప్ఫాబెట్, 1 ఎక్స్ బెట్, స్కై ఎక్స్‌చేంజ్, ఫ్యాన్సీ లైఫ్, క్రికెట్ మజా, లైవ్ లైన్ గురూ, లోటస్, బెట్ 65, బెట్ ఫెయిర్ వంటి ఆన్ లైన్‌క్రికెట్ బెట్టింగ్ యాప్‌లు డౌన్ లోడ్ చేసి పందెంకాస్తూ నష్టపోయిన వారు గతంలో చాలా మంది ఉన్నారు. బెట్టింగ్ యాప్‌ల గురించి సమాచారం తెలిస్తే ఇవ్వాలి. బెట్టింగ్ ఎవ్వరూ చేయవద్దు. ఈ బెట్టింగ్‌లతో యువత కెరీర్ ఇబ్బందుల్లో పడుతుంది.

- సన్‌ప్రీత్‌సింగ్, వరంగల్ పోలీస్ కమిషనర్

వరంగల్ శంభునిపేట పాఠశాలలో పరీక్ష రాయడానికి వచ్చిన విద్యార్థులు



పదో తరగతి పరీక్షలు షురూ



ప్లాటినం జూబ్లీ స్కూల్ పరీక్ష కేంద్రంలో తనిఖీ చేసిన కలెక్టర్ సత్యశారద



వరంగల్ పాపయ్యపేట చమన్‌లోని ప్రభుత్వ పాఠశాల పరీక్ష కేంద్రం గదిలో విద్యార్థులు

- 9,238 మంది విద్యార్థులకు 9,223 మంది హాజరు
- పలు కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్ సత్యశారద

వరంగల్/గీసుకొండ: జిల్లాలోని 49 కేంద్రాల్లో శుక్రవారం పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రారంభమయ్యాయి. 9,238 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకావాల్సి ఉండగా.. 9,223 మంది విద్యార్థులు (99.8 శాతం) హాజరై 15 మంది గైర్హాజరయ్యారని డీఈఓ జ్ఞానేశ్వర్ తెలిపారు. పరీక్ష కేంద్రాల సమీపంలో జిరాక్స్ సెంటర్లను మూసివేశారు. ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడిపించింది. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. కలెక్టర్ సత్యశారద వరంగల్ నగరంలోని ప్లాటినం జూబ్లీ పాఠశాల, గీసుకొండ మండల కేంద్రం, ధర్మారంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. సదుపాయాలు, సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్‌ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. వైద్య శిబిరాలను పరిశీలించారు. వేసవి కావడంతో విద్యార్థులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, అత్యవసర మందులు అందుబాటులో ఉంచాలని, మాల్ ప్రాక్టీస్‌కు అవకాశం లేకుండా పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు, వాచీలు, క్యాలికులేటర్లను అనుమతించవద్దని, పోలీస్ ఎస్కార్ట్‌తో పరీక్ష, జవాబుపత్రాల రవాణా చేయాలని సూచించారు. కలెక్టర్ వెంట జిల్లా పరీక్షల సహాయ కమిషనర్ కరుణ, చీఫ్ సూపరింటెండెంట్లు ఉన్నారు.

విద్యార్థికి అస్వస్థత

నల్లబెల్లి: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షకు హాజరైన ఓ విద్యార్థి శుక్రవారం అస్వస్థతకు గురయ్యాడు. వివరాలిలా ఉన్నాయి. రుద్రగూడెంలోని కాకతీయ బ్రిలియంట్ స్టార్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థి ఈశ్వర్ పాఠశాలలో పరీక్ష పూర్తిగా రాశాడు. సమయం 15 నిమిషాలు ఉండగా అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే అప్రమత్తమైన ఇన్విజిలేటర్ వైద్య సిబ్బందికి సమాచారం అందించారు. ఏఎన్ఎం మాధవి ప్రథమ చికిత్స అందించి 108కు ఫోన్ చేశారు. అధికారుల సూచనల మేరకు పరీక్ష సమయం ముగిసే వరకు ఆఫీస్ రూంలో 108 సిబ్బంది రామ్మూర్తి చికిత్స అందించారు. అనంతరం నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

జాతీయ జ్యోతిష్య సమ్మేళనానికి శ్రావణ్‌శాస్త్రి



నెక్కొండ: విజయవాడలో నిర్వహించనున్న జాతీయస్థాయి వైదిక జ్యోతిష్య సమ్మేళనానికి మండల కేంద్రానికి చెందిన జ్యోతిష్య వాస్తు పండితుడు బూరుగుపల్లి శ్రావణ్‌శాస్త్రి హాజరుకానున్నారు. నెక్కొండలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 23న విజయవాడలో సమ్మేళనం జరుగనుందన్నారు.

న్యూస్‌రీల్

అంగడి టెండర్ ఖరారు

గీసుకొండ: కొమ్మాల అంగడి పరిధిలోని ద్రస్రు తండా గ్రామపంచాయతీ వాటా కింద 6 వారాలపాటు అంగడి నిర్వహించడానికి శుక్రవారం టెండర్‌ను ఖరారు చేసినట్లు ఎంపీఓ ఆడెపు ప్రభాకర్ తెలిపారు. సీల్డ్ కవర్ ప్రక్రియ ద్వారా టెండర్‌లో 10 మంది పాల్గొనగా.. మోతీలాల్ అత్యధికంగా రూ.16,51,000కు టెండర్ దక్కించుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శులు నెల్లుట్ల సునీత, ఇ.లావణ్య, పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోవాలి

వరంగల్: జిల్లాలోని అన్ని కళాశాలల్లో చదువుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, దివ్యాంగులు, మైనార్టీ విద్యార్థులు ఫ్రెష్, రెన్యువల్ స్కాలర్‌షిప్‌లు, రీయింబర్స్‌మెంట్ కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి పి.భాగ్యలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. www.telanganaepass.cgg.gov.inలో ఈనెల 31వరకు దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు.

విదేశీ విద్యకు..

విదేశాల్లో ఉన్నత విద్యనభ్యసించేందుకు పేద ఎస్సీ విద్యార్థులకు ప్రభుత్వం అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకంలో ఆర్థిక సాయం అందిస్తుందని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి పి.భాగ్యలక్ష్మి తెలిపారు. ఈ పథకం కింద రూ.20 లక్షల స్కాలర్‌షిప్‌లు, వీసా, విమాన చార్జీలు చెల్లించనున్నట్లు పేర్కొన్నారు. జీఆర్ఈ/జీమ్యాట్/టోఫెల్/ఐఎల్ఈటీఎస్‌లో అర్హత స్కోర్‌తో పాటు డిగ్రీ/పీజీలో 60 శాతం మార్కులు పొంది ఏడాదికి రూ.5 లక్షలు ఆర్థిక ఆదాయం మించరాదని అన్నారు. www.telanganaepass.cgg.gov.inలో మే 19వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ప్రాథమిక పాఠశాలలో విచారణ



ఖానాపురం: దబ్బీరుపేట ప్రాథమిక పాఠశాలలో ఓ ఉపాధ్యాయుడి పనితీరుపై డీఈఓ ఆదేశాల మేరకు చీచీచీచీచీ శుక్రవారం విచారణ చేపట్టారు. ఉపాధ్యాయుడు తరచూ విధులకు గైర్హాజరవుతూ వేతనం మాత్రం పొందుతున్నట్లు 'సాక్షి' దినపత్రిలో ఇటీవల కథనం ప్రచురితమైంది. అదేవిధంగా పలు విద్యార్థి సంఘాలు కలెక్టర్, డీఈఓను కలిసి సదరు ఉపాధ్యాయుడిపై ఫిర్యాదు చేశాయి. దీంతో గీసుకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పట్టాభి ని విచారణ అధికారిగా నియమించగా ఆయన పాఠశాలకు చేరుకొని రికార్డులు పరిశీలించారు. అలాగే, గ్రామస్తులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పూర్తి నివేదికను త్వరలోనే కలెక్టర్, డీఈఓకు అందజేయనున్నట్లు ఆయన తెలిపారు.

ప్రచారం చేయండి

వరంగల్ అర్బన్ : స్వచ్ఛ సర్వేక్షణ్-2024 పోటీల్లో ఫీడ్‌బ్యాక్‌పై విస్తృతంగా ప్రచారం చేయాలని బల్దియా కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే ఆదేశించారు. శుక్రవారం మెప్మా కమ్యూనిటీ ఆర్గనైజర్లు (సీఓ)లతో బల్దియా ప్రధాన కార్యాలయంలో కమిషనర్ సమావేశమై పలు సూచనలు చేశారు. ఎక్కువ మార్కుల కోసం ప్రజలను భాగస్వాములను చేయాలన్నారు.

గంగదేవిపల్లిని సందర్శించిన రాజస్థాన్ ప్రతినిధులు

గీసుకొండ: మండలంలోని జాతీయ ఆదర్శగ్రామం గంగదేవిపల్లిని 21 మంది సభ్యులతో కూడిన రాజస్థాన్ రాష్ట్ర ప్రతినిధుల బృందం శుక్రవారం సందర్శించింది. రాజస్థాన్ రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ కోఆర్డినేటర్, అసోసియేట్ ప్రొఫెసర్ మురారీలాల్ శర్మ, కన్సల్టెంట్ కోఆర్డినేటర్ పునీత్ మౌర్య ఆధ్వర్యంలో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, అధికారులు టీజీఐఆర్‌డీ సెంటర్ హెడ్ అనిల్‌కుమార్ పర్యవేక్షణలో గంగదేవిపల్లి సందర్శనకు వచ్చారు. జీపీడీపీ ప్లాన్ పనులు, రూఫ్‌టాప్ వాటర్ హార్వెస్టింగ్ సిస్టం, బడి పిల్లలకు మధ్యాహ్న భోజనం, ఫారం పాండ్లు, తీగజాతి తోటల పెంకాన్ని పరిశీలించారు. గ్రామస్తులను రాంరాం బాయి, బహెన్ అంటూ ఆప్యాయంగా పలకరించారు. అంతర్జాతీయ అటవీ దినోత్సవం సందర్భంగా గ్రామపంచాయతీ ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం గ్రామీణాభివృద్ధి శాఖ శిక్షణ కేంద్రంలో జిల్లా శిక్షణ మేనేజర్ కూసం రాజమౌళి.. గ్రామ కమిటీల ద్వారా ప్రజల భాగస్వామ్యంతో సాధించిన విజయాలు, పొందిన 19 జాతీయ, రాష్ట్రస్థాయి అవార్డుల గురించి వివరించారు. గ్రామ అభివృద్ధి గురించి ప్రధాని నరేంద్రమోదీ మూడు సార్లు ప్రస్తావించినట్లు ఆయన గుర్తుచేశారు. 20 ఏళ్ల క్రితం గ్రామంలో ట్విన్‌పిట్ టెక్నాలజీతో నిర్మించిన మరుగుదొడ్లు దేశానికి రోల్ మోడల్‌గా నిలిచాయని పేర్కొన్నారు. జెడ్పీ సీఈఓ రాంరెడ్డి, స్వచ్ఛభారత్ కన్సల్టెంట్ శ్రీనివాసరావు, ఎంపీడీఓ వి.కృష్ణవేణి, ఎంపీఓ ఆడెపు ప్రభాకర్, ఏపీఎం చంద్రకాంత్, ట్రెనింగ్ మేనేజర్ కరుణాకర్, టీజీఐఆర్‌డీ ప్రతినిధి నిమ్మల శేఖర్, క్లస్టర్ టీపీలు సుధాకర్, సురేశ్, ఈసీ శ్రీలత, పంచాయతీ కార్యదర్శి సునీత, గ్రామస్తులు పాల్గొన్నారు.



గంగదేవిపల్లికి వచ్చిన రాజస్థాన్ ప్రతినిధులతో జిల్లా శిక్షణ మేనేజర్ కూసం రాజమౌళి

'హైపర్'తో సత్వర సేవలు

హన్మకొండ: హైపర్‌తో సత్వర సేవలు అందిస్తున్నట్లు టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ, వరంగల్ ఎస్ఈలు పి.మధుసూదన్‌రావు, కె.గౌతం రెడ్డి శుక్రవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ప్రకృతి వైపరీత్యాలు, భారీ వర్షాలు, ఈదురు గాలులు సంభవించినపుడు అతి తక్కువ సమయంలో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించడానికి 'హైపర్' అనే కార్యాచరణ రూపొందించామని పేర్కొన్నారు.

హైపర్ అంటే..

'హెచ్' అంటే హెడ్ క్వార్టర్‌లో అప్రమత్తంగా ఉండడం, 'ఎ' అంటే సిబ్బంది, సామగ్రి సమీకరణ, 'ఐ' అంటే సమాచార సేకరణ, చేరవేయడం, 'పీ' అంటే పటిష్ట వ్యూహాన్ని అమలు పర్చడం, 'ఇ' అంటే నిర్దిష్ట కార్యాచరణ అమలు, 'ఆర్' అంటే విద్యుత్ సరఫరా పునరుద్ధరించడం అని ఎస్ఈలు మధుసూదన్ రావు, గౌతంరెడ్డి వివరించారు.



25 నుంచి ఎఫ్‌పీఓఎస్ రాష్ట్రస్థాయి మేళా

వరంగల్: రైతు ఉత్పత్తిదారుల సంఘాల (ఎఫ్‌పీఓఎస్) రాష్ట్రస్థాయి మేళా ఈనెల 25 నుంచి 27 వరకు వరంగల్ రంగశాయిపేటలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ డాక్టర్ సత్యశారద, జిల్లా వ్యవసాయశాఖ అధికారి అనురాధ తెలిపారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో రైతు ఉత్పత్తిదారుల సంఘాల రాష్ట్రస్థాయి మేళాపై శుక్రవారం అధికారులతో సమన్వయ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఈ మేళాలో రైతు ఉత్పత్తిదారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వివిధ శాఖలు ఎలా సమన్వయంతో పనిచేయాలానే అంశంపై దిశా నిర్దేశం చేశారు. అనంతరం అధికారులతో కలిసి రంగశాయిపేటలోని మేళా స్థలాన్ని కలెక్టర్ పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ సత్యపాల్‌రెడ్డి, డీఆర్డీఓ, ఉద్యాన శాఖ అధికారి సంగీతలక్ష్మి, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ రమేశ్, మత్స్యశాఖ అధికారి నాగమణి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారద

ఎల్ఆర్ఎస్‌పై ప్రత్యేక దృష్టి..

ఎల్ఆర్ఎస్ ఆమోదించిన దరఖాస్తుల ఫీజు వసూలుపై ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు కలెక్టర్ సత్యశారద తెలిపారు. హైదరాబాద్ నుంచి మున్సిపల్ ప్రధాన కార్యదర్శి దానకిశోర్ శుక్రవారం సాయంత్రం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. జీడబ్ల్యూఎంసీ, మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల్లో ఎల్ఆర్ఎస్‌కు 41,443 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. అందులో 18,943 మంజూరు చేసి, 1,081 దరఖాస్తులకు ఫీజు సేకరించి, 1,081 ప్రొసీడింగ్‌లు జారీ చేసినట్లు పేర్కొన్నారు. మార్చి 31 లోపు ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లిస్తే వచ్చే 25 శాతం రాయితీపై ప్రజలకు వివరించాలని సూచించారు.

టెండర్లకు ఆహ్వానం

వరంగల్: జిల్లాలోని 670 అంగన్‌వాడీ కేంద్రాలకు కందిపప్పు సరఫరా చేయడానికి టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి బి.రాజమణి ఒక ప్రకటనలో తెలిపారు. నర్సంపేట, వర్ధన్నపేట ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలోని కేంద్రాలకు 2025 ఏప్రిల్ నుంచి మార్చి 2026 వరకు కిలో కందిపప్పు ప్యాకెట్లను నేరుగా సరఫరా చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. రవాణా చార్జీలు, జీఎస్టీ కలుపుకుని కందిపప్పు సరఫరా చేసేందుకు ఆసక్తిగల సంస్థలు, సరఫరాదారుల నుంచి కొటేషన్స్ ఇవ్వాలన్నారు. జిల్లా సంక్షేమ అధికారి (ఐసీడీఎస్) కార్యాలయంలో ఈనెల 28లోగా దరఖాస్తులు అందించాలని, వివరాల కోసం కార్యాలయంలో సంప్రదించాలని రాజమణి సూచించారు.

కోనారెడ్డి చెరువు సర్వే

వర్ధన్నపేట: వర్ధన్నపేటలోని కోనారెడ్డి చెరువును శుక్రవారం నీటిపారుదల, రెవెన్యూ శాఖ అధికారులు సంయుక్తంగా సర్వే నిర్వహించారు. కోనారెడ్డి చెరువుకు వెళ్లే దారులతోపాటు శిఖం భూములను కబ్జా చేశారంటూ ఈ నెల 10న కలెక్టర్‌కు అందిన ఫిర్యాదు మేరకు అధికారులు రంగంలోకి దిగారు. మత్తడి, ఎఫ్‌టీఎల్ భూభాగాలను పరిశీలించారు. 0.25 టీఎంసీల సామర్థ్యం కలిగిన కోనారెడ్డి చెరువు విస్తీర్ణం 478.6 ఎకరాలు ఉందని తహసీల్దార్ విజయసాగర్ తెలిపారు. సర్వే తర్వాత చెరువు ఏమేరకు ఆక్రమణకు గురైందో తెలుస్తుందని పేర్కొన్నారు. శిఖం భూములను ఎవరైనా ఆక్రమించడానికి ప్రయత్నిస్తే కఠిన చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు. అధికారుల అండతోనే అక్రమార్కులు చెరువు కబ్జా చేశారని స్థానికులు ఆరోపించారు. కబ్జాదారులను అధికారులు కాపాడేందుకు ప్రయత్నిస్తే సహించబోమని వారు స్పష్టం చేశారు.



సర్వే చేస్తున్న ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు

ప్రైవేట్ అప్పులు తీర్చేందుకు అదనపు రుణాలు



వ్యవసాయాధికారులు, రైతులతో డీఎల్ఎస్ఏ కార్యదర్శులు

వరంగల్ లీగల్ : రైతుల ప్రైవేట్ అప్పులు తీర్చుకోవడానికి, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మార్గదర్శకాల ప్రకారం బ్యాంకుల నుంచి పంట రుణాలకు అదనంగా దీర్ఘకాలిక రుణాలు పొందేందుకు రైతులు దరఖాస్తులు చేసుకోవాలని హనుమకొండ, వరంగల్ జిల్లాల న్యాయసేవాధికార సంస్థల కార్యదర్శులు జడ్జి క్షమాదేశ్ పాండే, ఎం.సాయికుమార్ సూచించారు. శుక్రవారం తెలంగాణ రైతు రక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు పాకాల శ్రీహరిరావు అధ్యక్షతన జిల్లా కోర్టు ఆవరణలో బ్యాంకర్లు, రెవెన్యూ అధికారులు, వ్యవసాయాధికారులు, రైతులతో హనుమకొండ, వరంగల్ న్యాయసేవాధికారి కార్యదర్శులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీహరిరావు మాట్లాడుతూ.. జిల్లా న్యాయసేవాధికార సంస్థల కార్యదర్శుల సూచన మేరకు అర్హులైన రైతులందరికీ ప్రైవేట్ అప్పులు తీర్చుకోవడానికి అదనపు రుణాలు మంజూరు చేసేందుకు బ్యాంకర్లు ఒప్పుకున్నట్లు తెలిపారు. సమావేశంలో తెలంగాణ రైతు రక్షణ సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కిషన్‌రావు, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు హింగే భాస్కర్, తిరుపతి, రాజు, బాపురావు, సీఐఎస్ఎఫ్ కోఆర్డినేటర్ తోకల్ ఆదిరెడ్డి, లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్, జిల్లా వ్యవసాయాధికారి రవికుమార్, బ్యాంకర్లు, వ్యవసాధికారులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ సెమిస్టర్ల పరీక్షలు నిర్వహించలేం

- కేయూ రిజిస్ట్రార్‌కు ప్రైవేట్ యాజమాన్యాల వినతి



వినతిపత్రం ఇస్తున్న అసోసియేషన్ బాధ్యులు

కేయూ క్యాంపస్: 'కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ప్రైవేట్ డిగ్రీ కళాశాలలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ప్రభుత్వం విడుదల చేయడం లేదు.. దీంతో ఆర్థికపరమైన సమస్యలు ఎదుర్కొంటున్నాం.. అందుకే రాబోయే రోజుల్లో యూనివర్సిటీ డిగ్రీ కోర్సుల 2,4,6 సెమిస్టర్‌ల పరీక్షలు నిర్వహించలేం' అని ప్రైవేట్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలల యాజమాన్యాల అసోసియేషన్ బాధ్యులు స్పష్టం చేశారు. ఈమేరకు శుక్రవారం రిజిస్ట్రార్ ఆచార్య రామచంద్రాన్ని కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీధర్‌రావు మాట్లాడుతూ గత 20 నెలలకు సంబంధించిన ఫీజులు చెల్లించకపోవడంతో కళాశాలల యాజమాన్యాలు ఇబ్బందులకు గురవుతున్నాయన్నారు. విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేయొద్దని, ఆర్‌టీఎఫ్ ద్వారా ప్రభుత్వమే చెల్లిస్తుందని చెప్పడంతో నిరీక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. కొన్ని యాజమాన్యాలు అప్పులు చేసి కళాశాలలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం కళాశాలలు నిర్వహించే పరిస్థితి లేదని, ఈనెల 25 వరకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు సుమారు రూ.2,500 కోట్లు చెల్లించని పక్షంలో ఏప్రిల్‌లో డిగ్రీకోర్సుల 2,4,6 సెమిస్టర్ల పరీక్షల నిర్వహణ సాధ్యం కాదని స్పష్టం చేశారు. రిజిస్ట్రార్‌ను కలిసిన వారిలో అసోసియేషన్ కేయూ అధ్యక్షుడు ఉపేందర్‌రెడ్డి, కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి, ఆర్థిక కార్యదర్శి జి.వేణుమాధవ్, ఇతర బాధ్యులు ఉన్నారు.

బడుగులపైకి దూసుకొచ్చిన లారీ

అప్రమత్తమైన ఆటోడ్రైవర్ | రోడ్డుపక్కనే గుంతలోకి దూసుకెళ్లిన ఆటో | ఒకరి మృతి, తొమ్మిది మందికి గాయాలు

వాళ్లందరు రోజువారీ కూలీలు.. రెక్కాడితే కానీ డొక్కాడని పరిస్థితి.. స్వగ్రామంలో పనిదొరక్క.. పనిని వెతుక్కుంటూ.. ప్రతీ రోజు యాభై కిలోమీటర్లు ఆటోలో వెళ్లి పనిచేసి తిరిగి ఇంటికొస్తారు.. రోజువారీ మాదిరిగానే.. శుక్రవారం కోడికూత వేళకు లేచి మధ్యాహ్నానికి సద్దిమూట పెట్టుకొని కూలీకోసం ఆటోలో బయల్దేరారు. ఈక్రమంలో మూలమలుపు వద్ద లారీ.. వీరి ఆటోమీదకు దూసుకొచ్చింది. దీంతో డ్రైవర్ రోడ్డు పక్కనే ఉన్న చెట్ల పొదల్లోకి ఆటోని తిప్పాడు.. రోడ్డుపక్కనే వేసిన సిమెంట్ దిమ్మెకు తాకి ఆటో బోల్తా పడడంతో ఒకరు మృతి చెందగా తొమ్మిది మంది తీవ్రంగా గాయపడ్డారు.

\- నర్సింహులపేట

మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలంలోని చెర్లపాలెంకు చెందిన ఆటోలో అదే గ్రామానికి చెందిన 14 మంది, పక్కనే ఉన్న ఫత్తేపురానికి చెందిన ముగ్గురు.. మొత్తం 17 మంది కూలీలు మిరపతోటలను ఏరడానికి శుక్రవారం ఉదయం మరిపెడ మీదుగా ఖమ్మం జిల్లాలోని తిరుమలాయపాలెం మండలానికి ఆటోలో బయల్దేరారు. ఈక్రమంలో పెద్దనాగారం స్టేజీ సమీపంలోని ఇటుక బట్టీల సమీపంలో మరిపెడ వైపునకు వెళ్తున్న ఆటోను వెనుక నుంచి లారీ అతివేగంతో వస్తూ ఢీ కొట్టడంతో ఆటోలో ప్రయాణిస్తున్న దర్మారపు సోమక్క, దర్మారపు సునీత, దర్మారపు ఉప్పలమ్మ, గూడెల్లి దుర్గ, గూడెల్లి అరుణ, డ్రైవర్ దర్మారపు పవన్‌కు తీవ్ర గాయాలు, మిగతా వారి స్వల్ప గాయాలు కావడంతో క్షతగాత్రులను మూడు అంబులెన్స్‌లలో మహబూబాబాద్ జనరల్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ చెర్లపాలెంకు చెందిన గూడెల్లి అరుణ(40)మృతి చెందింది.



మహబూబాబాద్ జిల్లా జనరల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు



గూడెల్లి అరుణ(ఫైల్)

ప్రమాదానికి మూలమలుపే కారణమా..

వరంగల్– ఖమ్మం హైవేపై పెద్ద నాగారం స్టేజీ సమీపంలో ఇటుక బట్టీల వద్ద గతంలో సైతం ప్రమాదాలు జరిగాయి. దీంతో ప్రమాదాలకు మూలమలుపే కారణమని, మూలమలుపు వద్ద లారీ అతివేగంతో నియంత్రణ కోల్పోయి వెనుకనుంచి కూలీల ఆటోను ఢీ కొట్టడంతో ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు చెబుతున్నారు.

ఉలిక్కిపడ్డ చర్లపాలెం..

మిరపతోటలను ఏరడానికి వెళ్తున్న కూలీల ఆటో ప్రమాదానికి గురికావడంతో చెర్లపాలెం ఒక్కసారిగా ఉలిక్కి పడింది. కూలీల బంధువులు, కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఆందోళనకు గురయ్యారు. ఎస్సై సురేష్ ఘటన స్థలాన్ని సందర్శించారు. మృతురాలి బంధువుల ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



ప్రమాదంలో ముళ్ల పొదల్లోకి వెళ్లిన ఆటో

ఆటోడ్రైవర్ అప్రమత్తతతో తప్పిన పెను ప్రమాదం

కూలీల ఆటో పెద్దనాగారం సమీపంలోని మూలమలుపు వద్దకు రాగానే లారీ ఒక్కసారిగా ఆటోవైపు దూసుకొచ్చింది.. అంతా లారీ కింద పడిపోయామని భావించగా.. ఆటో నడుపుతున్న దర్మారపు పవన్ అప్రమత్తమై.. పక్కనే ఉన్న చెట్లపొదల్లోకి ఆటోను తిప్పాడు. అప్పటికే వేగంతో ఉన్న ఆటో అదుపుతప్పి పొదల్లోని సిమెంట్ దిమ్మెను తగిలి పల్టీ కొట్టింది. లారీ కింద పడి ప్రాణాలు కోల్పోయేకంటే గాయపడడం మేలనే ఉద్దేశంతో ఆటోను రోడ్డు పక్కకు తిప్పినట్టు డ్రైవర్ పవన్ ఏడుస్తూ చెప్పడం అందరిని కంటతడి పెట్టించింది.

ఆస్పత్రిలో ఆర్తనాదాలు..

నెహ్రూసెంటర్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులను జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకురావడంతో వారి ఆర్తనాదాలతో ఆస్పత్రి మార్మోగింది. చేతులు, కాళ్లు, మెడ, తల ఇలా.. శరీరమంతా గాయాలతో వచ్చిన ప్రమాద బాధితులతో ఆస్పత్రిలో ఎక్కడ చూసినా రక్తం కనిపించింది. బాధితుల్లో ఒకరు మృతి చెందగా మిగిలిన కూలీలు చికిత్స పొందుతున్నారు. బాధితులకు వైద్యం అందుతున్న విధానాన్ని ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, ఆర్ఎంఓ డాక్టర్ జగదీశ్వర్, ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకట్ పర్యవేక్షించారు. కాగా, తీవ్రంగా గాయపడిన గూడెల్లి మంగమ్మ, దర్మారపు సాలమ్మ, దర్మారపు యాకమ్మను వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. ఇదిలా ఉండగా.. పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి, ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ గుగ్గిళ్ల పీరయ్య, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుడ్డెల రాంమూర్తి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వీరయ్య, గణేష్, తదితరులు గాయపడినవారిని పరామర్శించారు.



ప్రమాద బాధితులను పరామర్శిస్తున్న ఝాన్సీరెడ్డి

పంటను తరలిస్తూ పరలోకాలకు..



రమేష్ (ఫైల్)

దంతాలపల్లి: ఆరుగాలం కష్టం చేసి చేతికొచ్చిన పంటను తరలిస్తూ.. ఓ రైతు మృతి చెందిన ఘటన మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలం బొడ్లాడ గ్రామ శివారులో గురువారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. నర్సింహులపేట మండలం కొమ్ములవంచ గ్రామ శివారు దుబ్బతండాకు చెందిన జాటోత్ రమేష్(35)కు బొడ్లాడ గ్రామ శివారులో వ్యవసాయ భూమి ఉంది. తన చేనులో పండిన మొక్కజొన్న కంకులను ట్రాక్టర్ సాయంతో స్వయంగా ఒక చోటుకు తరలిస్తున్నాడు. ఈ క్రమంలో ట్రాక్టర్‌లో పోసిన కంకులను అన్‌లోడ్ చేసిన అనంతరం ట్రాలీ కిందకు దిగలేదు. దీంతో సరిచేసే క్రమంలో ట్రాలీ ఒక్కసారిగా రమేష్‌పై పడడంతో మృతి చెందాడు. మృతుడికి భార్య లీల, ఇద్దరు కుమారులు చేతన్, రంజిత్ ఉన్నారు. లీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై రాజు తెలిపారు.

అప్పుల బాధతో మొక్కజొన్న రైతు ఆత్మహత్య



మధుకృష్ణ (ఫైల్)

వెంకటాపురం (కె): అప్పులబాధతో మొక్కజొన్న రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన ములుగు జిల్లా వెంకటాపురం (కె) మండలం బర్లగూడెం పంచాయతీ పరిధి చిరుతపల్లి గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. చిరుతపల్లి గ్రామానికి చెందిన లుక మధుకృష్ణ (29) అనే రైతు రెండెకరాల్లో బాండ్ మొక్కజొన్న సాగు చేశాడు. చేను దిగుబడి రాక పోవడంతో పెట్టిన పెట్టుబడి రాక రూ.లక్ష మేర అప్పుల పాలయ్యాడు. దీంతో మనస్తాపానికి గుర్రై గురువారం ఉదయం పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతన్ని వెంటనే వెంకటాపురం వైద్యశాలకు తరలించి చికిత్స నిర్వహించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వరంగల్ ఎంజీఎంకు తరలించగా, చికిత్స పొందుతూ శుక్రవారం చనిపోయాడు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలున్నారు.

ఒకే దేశం, ఒకే ఎన్నిక నష్టమే..

- సంకీర్ణ ప్రభుత్వాలతోనే ప్రజాస్వామ్యానికి రక్షణ
- ప్రముఖ సామాజికవేత్త ప్రొఫెసర్ హరగోపాల్



మాట్లాడుతున్న ప్రొఫెసర్ హరగోపాల్

కేయూ క్యాంపస్: భిన్నత్వంలో ఏకత్వంతో కూడిన భారతీయ సమాజానికి 'ఒకే దేశం– ఒకే ఎన్నిక' నష్టదాయకమని ప్రముఖ సామాజిక వేత్త హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ హరగోపాల్ అభిప్రాయపడ్డారు. శుక్రవారం కాకతీయ యూనివర్సిటీ సెనెట్ హాల్‌లో రాజనీతిశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 'భారత సమాజంలో సంకీర్ణ ప్రభుత్వాలు ప్రజాస్వామ్యం' అనే అంశంపై నిర్వహించిన జాతీయ సదస్సులో ఆయన కీలకోపన్యాసం చేశారు. రాజకీయ పార్టీల మేనిఫెస్టోలు ఓటర్లను ఆకర్షించడానికి ఉపయోగపడుతున్నప్పటికీ వాటి అమలులో మాత్రం చిత్తశుద్ధి లోపిస్తోందన్నారు. దేశంలోని విభిన్న జాతులు, కులాలు, మతాలు, బహుళ సంస్కృతి, సంప్రదాయాలతో కలిసిమెలిసి జీవిస్తున్న ప్రజల హక్కులు, ప్రజాస్వామ్యానికి సంకీర్ణ ప్రభుత్వాలతోనే రక్షణ సాధ్యమని ఆయన అన్నారు. నిత్యం ప్రజలు ఎదుర్కొనే సమస్యలను పరిష్కరిస్తూ.. ప్రజల జీవితాల్లో మెరుగైన మార్పులు తెచ్చి సమాజాన్ని శాస్త్రీయంగా విశ్లేషిస్తూ ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించడమే రాజకీయ పార్టీల ప్రధాన కర్తవ్యంగా ఉండాలన్నారు. నేటి రాజకీయ పార్టీలు కార్పొరేట్ శక్తుల ధన ప్రలోభాలకు లోనై ఓటర్లను ప్రభావితం చేయడం ప్రజాస్వామ్య ఉనికికి ప్రమాదకరమన్నారు. 1960 దశకం చివరి నుంచి దేశంలో ప్రభుత్వాల ఏర్పాటులో ప్రాంతీయ పార్టీల ప్రభావం పెరిగిందన్నారు. 1991లో దేశంలో నూతన ఆర్థిక పారిశ్రామిక విధానాలు, గ్లోబలైజేషన్ ప్రభావంతో సమాజంలో మానవీయ సంబంధాలు కనుమరుగై, మార్కెట్ సంబంధాలు పెరిగిపోతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఉగ్రవాద సంస్థల్లో మార్పు తీసుకొచ్చేందుకు కార్పొరేట్ శక్తులతో ఏర్పడిన అసమాన సమాజాన్ని తొలగించేందుకు మానవీయ శాస్త్రాలు, రాజనీతి శాస్త్ర ప్రాముఖ్యత అవసరమన్నారు. నేటితరం విద్యార్థులు సమాజ అభివృద్ధి కోసం ప్రశ్నించేతత్వాన్ని, ప్రజాస్వామిక లక్షణాలను పెంపొందించుకోవాలని హరగోపాల్ సూచించారు.

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా..

ప్రాంతీయ పార్టీలతో ఏర్పడిన సంకీర్ణ ప్రభుత్వాలు ప్రజలకు జవాబుదారీగా ఉంటాయని గుల్బర్గా యూనివర్సిటీ యాక్టింగ్ వీసీ ప్రొఫెసర్ శ్రీరాములు అన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణమైన పాలన అందిస్తేనే ప్రాంతీయ పార్టీల ప్రభుత్వాలు, సంకీర్ణ ప్రభుత్వాలకు మనుగడ ఉంటుందని అభిప్రాయపడ్డారు. ఈ సదస్సులో కేయూ రిజిస్ట్రార్ ఆచార్య రామచంద్రం, ముంబాయి యూనివర్సిటీ ప్రొఫెసర్ జోష్ జార్జ్, సోషల్ సైన్స్ డీన్ మనోహర్, రాజనీతి శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ సంకినేని వెంకటయ్య, బీఓఎస్ చైర్మన్ డాక్టర్ గడ్డం కృష్ణ, అధ్యాపకులు సత్యనారాయణ, నాగరాజు, లక్ష్మీనారాయణ, సంజీవ్, భాగ్యమ్మ, లలిత కుమారి, విజయ్, పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా.. రాజనీతి శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో రాత్రి నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలను రిజిస్ట్రార్ రామచంద్రం ప్రారంభించారు.





ర్యాంప్ వాక్, నృత్యం చేస్తున్న విద్యార్థినులు

ఉత్సాహంగా రూబిజెస్ట్ - 2025

- కేయూ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహణ
- ఆకట్టుకున్న విద్యార్థినుల ర్యాంప్ వాక్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ మహిళా ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో రూబిజెస్ట్– 2025లో భాగంగా శుక్రవారం థిమ్ డే వేడుకలను ఉత్సాహంగా కొనసాగాయి. ప్రోగ్రాం కన్వీనర్ సాయి తరుణ్, వివిధ ఆర్గనైజర్ల ఆధ్వర్యంలో యూనివర్సిటీ ఆడిటోరియంలో కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ వేణుగోపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ఆయా ఉత్సవాలను ప్రారంభించారు. ఈ వేడుకల్లో కేరళ సంప్రదాయ దుస్తులు ధరించి మహిళా అధ్యాపకులు చేసిన ర్యాంప్ వాక్ ఆకట్టుకుంది. అంతే కాకుండా వారు ఇచ్చిన సోలో, గ్రూప్ డ్యాన్స్‌లు ఆకర్షణగా నిలిచాయి. జాతీయ స్థాయిలో ఉన్న వివిధ ప్రాంతాల, సంప్రదాయ నత్య రీతులవారు ధరించే దుస్తులను ధరించి కళాశాల విద్యార్థినులు చేసిన ర్యాంప్ వాక్ ఆకట్టుకుంది. వివిధ విభాగాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ర్యాంప్ వాక్ ప్రదర్శనలో నిలిచిన బీటెక్ ఈసీఈ విభాగం ప్రథమ సంవత్సరం విద్యార్థిని సుదూప్తికి ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ వేణుగోపాల్‌రెడ్డి బహుమతి అందజేశారు.

పునరుద్ధరణ పనులు పూర్తి చేయాలి

- జీఎం అరుణ్‌కుమార్ జైన్

ఖిలా వరంగల్: అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద కొనసాగుతున్న వరంగల్ రైల్వేస్టేషన్ పునరుద్ధరణ పనులను శరవేగంగా పూర్తి చేయాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ అధికారులకు ఆదేశించారు. శుక్రవారం వరంగల్ రైల్వేస్టేషన్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్ (ఏబీఎస్ఎస్) కింద రూ.25.41కోట్లలో జరుగుతున్న పాదచారుల వంతెన(ఫుట్ ఓవర్ బ్రిడ్జి), 3 లిఫ్టులు, 4 ఎస్కలేటర్లు, లిఫ్టులు, గ్రీనరీ పనులను పరిశీలించారు. అంతకు ముందుగా రైల్వే కోచ్ రెస్టారెంట్‌ను తిలకించారు. అనంతరం జీర్పీ పోలీసులకు నూతన భవనం నిర్మించాలని జీఎంకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఎం భరతేష్‌కుమార్, సీనియర్ డీసీఎం బాలాజీ కిరణ్, స్టేషన్ మేనేజర్ బాలరాజ్‌నాయక్, సీసీఐ రాజగోపాల్, ఆర్పీఎఫ్ సీఐ సీఎస్ ఆర్ కృష్ణ, జీర్పీ సీఐ సురేందర్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



వరంగల్ రైల్వేస్టేషన్‌లో కొనసాగుతున్న పనులను పరిశీలిస్తున్న జీఎం అరుణ్‌కుమార్ జైన్

తొర్రూరులో అబార్షన్ కలకలం

తొర్రూరు: మానుకోట జిల్లా తొర్రూరు పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో 16 ఏళ్ల మైనర్ బాలికకు అబార్షన్ చేసిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. వివరాల్లోకి వెళ్తే.. దంతాలపల్లి మండలానికి చెందిన ఓ బాలిక గర్భం దాల్చగా అబార్షన్ నిమిత్తం కుటుంబ సభ్యులు శుక్రవారం తొర్రూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకొచ్చారు. ఆస్పత్రి వైద్యులు పరీక్షించి అబార్షన్ చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు వైద్యాధికారులు, చైల్డ్ లైన్ ప్రతినిధులు ఆస్పత్రిని సందర్శించారు. బాలిక కుటుంబ సభ్యులు, ఆస్పత్రి వైద్యులతో మాట్లాడారు. బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు గర్భం దాల్చడానికి కారణమైన వ్యక్తిపై స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీడబ్ల్యూసీ చైర్ పర్సన్ నాగవాణి, వైద్యాధికారులు జ్వలిత, మంగమ్మ, సారంగం తదితరులు అబార్షన్ ఘటనపై ఆరా తీశారు. విచారణ అనంతరం ఆస్పత్రిపై చర్యలపై ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు.

అర్ధరాత్రి.. మూగజీవాల మృత్యుఘోష

గొర్రెలు, మేకల ఫామ్‌లో వ్యాపించిన మంటలు

- సజీవదహనమైన 450 జీవాలు.. సుమారు రూ.30లక్షల నష్టం
- ఆకతాయిల పనేనంటున్న బాధితులు
- ఘటన స్థలాన్ని సందర్శించిన డీసీపీ సలీమా, ఏసీపీ నందిరాంనాయక్

ఖిలా వరంగల్ : ఆ మూగజీవాలు ప్రమాదమని గుర్తించలేవు. కాపాడండి అని అరవలేవు. మద్యం మత్తులో ఆకతాయిలు చేసిన పనికి అర్ధరాత్రి మాంసంముద్దలయ్యాయి. వాటినే నమ్ముకున్న ఓ వ్యక్తి కుటుంబం రోడ్డున పడింది. ఇంతటి ఘాతుకానికి పాల్పడిందెవరు?.. అన్నది పోలీసులు తేల్చాల్సి ఉంది. ఖిలావరంగల్ మట్టికోట ఎల్బీగండి సమీపాన గొర్రెలు, మేకల ఫామ్‌లో గురువారం రాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో 450 గొర్రెలు, మేకలు సజీవ దహనమైన విషయం తెలిసిందే. సుమారు రూ.30లక్షల ఆస్తినష్టం జరిగిందని బాధితులు బోరున విలపిస్తున్నారు.

ఫామ్‌ను సందర్శించిన పోలీసులు

అగ్ని ప్రమాదం జరిగిన స్థలాన్ని శుక్రవారం ఉదయం వరంగల్ సెంట్రల్ జోన్ డీసీపీ సలీమా, ఏసీపీ నందిరామ్ నాయక్‌తోపాటు పశుసంవర్ధకశాఖ జేడీ బాలకృష్ణ, తహసీల్దార్ బండి నాగేశ్వర్‌రావు, ఎంహెచ్‌ఓ రాజేష్, ఇన్‌స్పెక్టర్ వెంకటరత్నం, స్థానిక కార్పొరేటర్ ఉమ సందర్శించారు. మాంసం ముద్దలైన మూగజీవాలను పరిశీలించారు. బాధితులైన దుగ్గిరాల లక్ష్మణ్, దుగ్గిరాల కుమారీలను పరామర్శించి ధైర్యాన్ని కల్పించారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని, భవిష్యత్తులో కూడా అన్ని విధాలుగా అదుకుంటామని డీసీపీ హామీ ఇచ్చారు.



ఘటన స్థలాన్ని పరిశీలించి బాధిత కుటుంబంతో మాట్లాడుతున్న డీసీపీ సలీమా, అధికారులు

మొదలైన దర్యాప్తు

గొర్రెల ఫామ్‌లో గురువారం రాత్రి సంభవించిన అగ్ని ప్రమాదంలో జరిగిన నష్టం మీద బాధితురాలు దుగ్గిరాల కుమారీ మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఫామ్‌లో కరెంట్ సరఫరా లేదని, బ్యాటరీ సహాయంతో సీసీ కెమెరాలు పనిచేస్తాయని, అవికూడా మంటల్లో పూర్తి కాలిబూడిదైనట్లు తెలిపింది. ఆంధ్రానుంచి బతుకుదెరువు కోసం వలస వచ్చి.. కోట ప్రాంతంలో స్థలాన్ని లీజుకు తీసుకుని ఫామ్ పెట్టుకుని జీవనం సాగిస్తున్నామని, శతృవులంటూ ఎవరూ లేరని, మద్యం, గంజాయికి బానిసైన ఆకతాయిలే ఫామ్‌కు నిప్పు అంటించి ఉంటారని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది.

> **ప్రభుత్వం ఆదుకోవాలి..**
>
> ఆకతాయిలు చేసిన పనికి నా కుటుంబం రోడ్డు మీద పడింది. జీవనాధారమైన 450 మూగజీవాలు మంటల్లో మాంసం ముద్దలయ్యాయి. సుమారు రూ.30లక్షల విలువైన గొర్రెలు, మేకల మృతి చెందాయి. ప్రభుత్వమే నా కుటుంబాన్ని ఆదుకోవాలి.
>
> – దుగ్గిరాల లక్ష్మణ్, బాధితుడు



కళేబరాల పూడ్చివేత

బల్దియా అధికారులు పరిసర ప్రాంతాల్లో వ్యాధులు ప్రబలకుండా గొర్రెలు, మేకల కళేబరాలను వాహనాల్లో ఇతర ప్రాంతాలకు తరలించి పూడ్చివేశారు.. అంతకుముందు పశువైద్యులు కళేబరాలనుంచి శాంపిల్స్ సేకరించారు.

లేని ఫైర్ స్టేషన్

ఖిలావరంగల్ మండల పరిధిలో ఫైర్‌స్టేషన్ లేదు. చుట్టూ పది కిలోమీటర్ల మేర మండలం విస్తరించి ఉంది. ఎక్కడైనా అగ్ని ప్రమాదాలు సంభవిస్తే వర్ధన్నపేట, హనుమకొండ, మట్టెవాడ పరిధిలోనుంచి ఫైరింజన్లు రావాలి. ఆలోగా మంటలు పూర్తిగా అంటుకుని బుగ్గి అవుతోందని స్థానికులు చెబుతున్నారు.

సీఎస్ఆర్డీలో ఎన్పీడీసీఎల్‌కు 'ఎ' రేటింగ్

హన్మకొండ: కేంద్ర ఇంధన మంత్రిత్వ శాఖ విడుదల చేసిన కన్స్యూమర్ సర్వీసింగ్ రేటింగ్ ఆఫ్ డిస్కమ్స్ (సీఎస్ఆర్డీ)లో నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ (టీజీఎన్పీడీసీ ఎల్) జాతీయ స్థాయిలో 'ఎ' రేటింగ్‌తో కేటగిరిలో 5వ స్థానంలో నిలిచింది. విద్యుత్ వినియోగదారులకు మెరుగైన, నాణ్యమైన సేవలు అందిస్తూ, త్వరగా సర్వీస్‌ల మంజూరు, ఇతర సేవలు, మీటరింగ్, బిల్లింగ్ ప్రక్రియ వేగంగా నిర్వహించడం, ఫిర్యాదుల పరిష్కారంలో జవాబుదారీతనం, కార్యాచరణలో ముందుండడం ద్వారా దేశంలోని అన్ని డిస్కమ్‌లలో ఎన్పీడీసీఎల్ ఐదో స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి మాట్లాడుతూ.. ఎన్పీడీసీఎల్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సరఫరా అందిస్తున్నామన్నారు. అర్బన్ ప్రాంతంలో 23.57 గంటలు, రూరల్ ప్రాంతంలో 22.48 గంటలు సరఫరా అందిస్తున్నామని వివరించారు. జాతీయ సగటుతో పోల్చుకుంటే అర్బన్‌లో 23.30 గంటలు, రూరల్‌లో 21.34 గంటలతో నేరుగా ఆన్‌లైన్ ద్వారా 100 శాతం దరఖాస్తుల ప్రక్రియ చేపట్టడం, బిల్లింగ్ జారీని 100 శాతం పూర్తి చేసినందుకు ఈ ర్యాంకు వచ్చిందన్నారు.